




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
అక్టోబరు 24, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ జి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచి, స్థానిక ఎన్నికలకు వెళ్దాం




- న్యాయ నిపుణులతో చర్చించి తుది నిర్ణయం
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానం
- స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత
- గవర్నర్ ఆమోదంతో త్వరలో ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ
- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో టీబీఎంకు స్వస్తి..
- సరికొత్త డ్రిల్లింగ్ పరిజ్ఞానంతో తవ్వకాలు
- 1,500 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ యూనిట్ల ఏర్పాటు
- మంత్రివర్గం కీలక నిర్ణయాలు.. వెల్లడించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎన్నికల నిర్వహణపై వచ్చే నెల 7వ తేదీన తుది నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం.. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై న్యాయ నిపుణుల సలహాల ప్రకారం ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం గురువారం రాష్ట్ర సచివాలయంలో సుదీర్ఘంగా సమావేశమై పలు అంశాలపై చర్చించింది. అనంతరం రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సచివాలయంలో 2లో



## రౌడీ షీటర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది

- జూబ్లీహిల్స్ ప్రచారంలో రౌడీషీటర్లు వీరంగం వేస్తున్నారు
- ఉప ఎన్నికపై సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ఈ ఎన్నికలో రౌడీషీటర్ గెలిస్తే శాంతిభద్రతల పరిస్థితి ఏంటి?
- ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నేతలను గల్లా పట్టి అడగండి
- రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది
- బీజేపీ గురించి జూబ్లీహిల్స్ ఓటర్లు ఆలోచించడం లేదు
- బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమైంది..
- భారీ మెజారిటీయే మన లక్ష్యం

హైదరాబాద్: 'జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీషీటర్‌ను పోటీలో నిలబెట్టి ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టింది. కాంగ్రెస్ ప్రచారంలో రౌడీషీటర్లు పాల్గొంటూ కత్తులు, కటార్లతో ఇప్పుడే వీరంగం వేస్తున్నారు. రౌడీలను




## ఆసియాన్'కు వర్చువల్‌గా

సదస్సును ఉద్దేశించి ఆన్‌లైన్‌లో ప్రసంగించనున్న ప్రధానమంత్రి మోదీ

మోదీకి బదులుగా హాజరుకానున్న విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్



## కర్నూలు జిల్లాలో ప్రైవేట్ బస్సులో అగ్నిప్రమాదం

- బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తుండగా ఘటన
- స్కూటర్‌ను ఢీకొట్టడంతో చెలరేగిన మంటలు
- ప్రమాదంలో 25 మంది వరకు ప్రయాణికులు సజీవదహనం
- అత్యవసర ద్వారం పగలగొట్టి బయటపడిన 12 మంది

# గూగుల్ వైజాగ్ ను ఎంచుకుంది...

## మరి మీ సంగతి ఏంటి?

- యూఏఈ పర్యటనలో భాగంగా రెండో రోజు అబుదాబీలో చంద్రబాబు..
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ..
- రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి..
- అమరావతి కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఉంటుంది..
- విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానం..

అమరావతి,:విశాఖపట్నంలో అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ వస్తున్న నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టామని, ఈ రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం ఆయన యూఏఈకి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి రంగంలో పెట్టుబడి పెట్టాలని ప్రముఖ సంస్థ అపెక్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ చైర్మన్ ఖలీఫా కౌరీని కోరారు. బ్యాటరీ స్టోరేజీ రంగంలో పెట్టుబడులపైనా చర్చించారు. హైకెపాసిటీ బ్యాటరీ స్టోరేజీ ద్వారా గ్రిడ్ డిమాండ్‌ను నిర్వహించేందుకు ఆస్కారం ఉందని అపెక్స్ ప్రతినిధులు ఆయనకు తెలిపారు. సూపర్ కెపాసిటర్స్ తయారీలోనూ అపెక్స్‌కు మంచి పేరుండడంతో ఏపీలో అందులోనూ పెట్టుబడులు పెట్టాలని సీఎం కోరారు. చంద్రబాబు ఆహ్వానాన్ని తప్పక పరిశీలిస్తామని, పెట్టుబడులు 2లో




# కొత్త సీజేఐ ఎంపిక ప్రక్రియ షురూ



న్యూఢిల్లీ: భారత సర్వోన్నత న్యాయస్థానంలో తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం గురువారం మొదలుపెట్టింది. నవంబర్ 23వ తేదీన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో నూతన సీజేఐ ఎంపిక ప్రక్రియకు కేంద్రం శ్రీకారం చుట్టింది. తదుపరి సీజేఐగా మీరు ఎవరిని సిఫార్సు చేస్తారో తెలపాలంటూ ప్రభుత్వం నుంచి అధికారిక లేఖ గురువారం లేదా శుక్రవారం లోపు జస్టిస్ బీఆర్ గవాయ్‌కు చేరుకోనుందని విశ్వసనీయ వర్గాలు గురువారం వెల్లడించాయి. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ప్రక్రియలో ఇదే విధానాన్ని అమలుచేస్తుండటం తెల్సిందే. సీజే దిగిపోయాక ఆయా కోర్టుల్లో అత్యంత సీనియర్ జడ్జీనే సీజేగా సిఫార్సుచేసే సంప్రదాయం కొనసాగుతోంది. ఇదే విధానాన్ని పాటిస్తూ కేంద్ర న్యాయ శాఖ సీజేఐకి కొత్త సీజేఐ ఎంపిక కోసం తగు గడువు ఇచ్చే అవకాశముందని సంబంధిత వర్గాలు గురువారం

(మిగతా 2వ పేజీలో)



## పదో తరగతి పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్ : రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను ప్రభుత్వ పరీక్ష విభాగం ప్రకటించింది. ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈనెల 30వ తేదీ నుంచి నవంబర్ 13 లోపు విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫీజు చెల్లించాలని తెలిపింది. హెచ్ఎంలు ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 14 లోపు ఫీజు చెల్లింపు చేయాలని, విద్యార్థుల డాటాను నవంబర్ 18 లోపు డిఇఒలకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.50 ఆలస్య రుసుంతో నవంబర్ 29 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 2 నుంచి 11వ తేదీ వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 నుంచి 29 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు.

# ప్రజలు కోరితే కొత్త పార్టీ

- ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన ఈనెల 25న నిజామాబాద్ నుంచి 'జనం బాట' ప్రారంభం
- ప్రజల అభిప్రాయం తెలుసుకుంటా.. యాదాద్రి ప్రాశస్త్యాన్ని కాపాడేలా ప్రభుత్వం ప్రయత్నించాలి
- శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న కవిత



# లోకల్ బాడీలో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేతను స్వాగతిస్తున్నాం. ప్రభుత్వానికి ధన్యవాదములు..

**జనాభా అధికంగా ఉన్న బీసీలకు ఇది ప్రయోజనకరం..**

**చట్టపరమైన ఆటంకాలు లేని నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 42 % అమలుపరచరెందుకు?**

**దాసు సురేశ్ ,బీసీ జేఏసీ కో చైర్మన్,**

**బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు**



హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి : లోకల్ బాడీ ఎన్నికలలో ముగ్గురు పిల్లల నిబంధనకు సంభందించిన తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని సెక్షన్ 21 (3) ను నేడు తెలంగాణ క్యాబినెట్ తొలగించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ జేఏసీ కో చైర్మన్, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. గ్రామీణ స్థాయిలో జనాభా అధికంగా ఉండే బీసీ ఎస్సీ ఎస్టీ ల రాజకీయ ఎదుగుదలకు ఈ నిర్ణయం అత్యంత ప్రయోజనకరమని తెలిపారు... కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం ప్రభుత్వం అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నప్పటికే 50 రిజర్వేషన్ల సీలింగ్ అడ్డుపడుతున్నదనీ అయితే ఇదే తరుణంలో న్యాయస్థానాలతో సంబంధం లేని మంత్రి పదవుల్లో, నామినేటెడ్,పార్టీ పదవుల్లో, డీసీసీ నియామకాల్లో, అధికారిక పదవుల్లో బీసీలకు 42 శాతం మేరకు అవకాశాలను కల్పించడానికి ఎదురవుతున్న ఆటంకాలేమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించారన్నారు.. ప్రస్తుతం కొనసాగుతున్న డీసీసీ నియామకాలలో 50% బీసీలకు అధ్యక్షులుగా అవకాశం ఇవ్వాలన్నారు. చేనేత, జౌళి, గీత కార్మిక, విశ్వకర్మ తదితర కార్పొరేషన్లు రజక, నాయి బ్రాహ్మణ ,వడ్డెర ,మేదరి,వడ్రంగి తదితర ఫెడరేషన్ లకు నేటికీ చైర్మన్ నియామకాలు చేపట్టడం లేదనీ ఇది బీసీల పట్ల వివక్ష గానే తాము పరిగణిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.. కాంగ్రెస్ అధిష్టానం వెంటనే ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని బీసీలకు రాజకీయంగా కొనసాగుతున్న నష్టాన్ని నివారించాలన్నారు..

## కర్నూలు జిల్లాలో ప్రైవేట్ బస్సులో అగ్నిప్రమాదం

కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున పెను విషాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు అగ్నికి ఆహుతై, బూడిదైపోయింది. ఈ ఘోర దుర్ఘటనలో 25 మంది వరకు సజీవ దహనమైనట్లు సమాచారం. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం, కావేరి ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. కర్నూలు నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో కల్లూరు మండలం చిన్నటేకూరు వద్దకు రాగానే, వేగంగా వెళ్తున్న బస్సు అదుపుతప్పి ఓ స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో బస్సు ముందు భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రయాణికుల్లో చాలామంది గాఢ నిద్రలో ఉండ టంతో ఏం జరుగుతుందో గ్రహించేలోపే మంటలు బస్సును పూర్తిగా చుట్టుముట్టాయి. క్షణాల్లోనే అగ్నికీలలు ఎగిసిపడి బస్సు మొత్తం వ్యాపించాయి. కొందరు ప్రయాణికులు అప్రమత్తమై, అత్యవసర ద్వారాన్ని పగలగొట్టుకుని బయటపడ్డారు. ఈ ఘటనలో మొత్తం 12 మంది ప్రాణాలతో బయటపడగా, వారికి కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు పూర్తిగా దగ్ధం కావడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఈ నెల 30న జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ...

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ వారం ఆసియాలో కీలక పర్యటన చేపట్టనున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న అమెరికా-చైనా వాణిజ్య యుద్ధానికి ముగింపు పలికే దిశగా ఈ పర్యటన సాగనుంది. ఇందులో భాగంగా దక్షిణ కొరియాలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ట్రంప్ జరపనున్న సమావేశంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ నెల 30న ఈ కీలక భేటీ జరగనుందని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ గురువారం వెల్లడించారు. శుక్రవారం వాషింగ్టన్ నుంచి బయలుదేరనున్న ట్రంప్, ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (%ఊ్రాజుజ%) సదస్సులో పాల్గొంటారు. గతంలో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో జిన్‌పింగ్‌తో సమావేశాన్ని రద్దు చేసుకుంటానని హెచ్చరించిన ట్రంప్, తాజాగా "అన్ని విషయాలపై ఒప్పందం" కుదుర్చుకోవాలని ఆశిస్తున్నట్లు బుధవారం వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల చైనా రేర్ ఎర్త్ లోహాలపై ఆంక్షలు విధించడంతో ఇరు దేశాల మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ఈ నేపథ్యంలో ఈ భేటీ ఫలితంపై ప్రపంచ మార్కెట్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఈ పర్యటనలో భాగంగా ట్రంప్ మొదట మలేషియా చేరుకొని ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య సదస్సులో పాల్గొంటారు. అక్కడ థాయ్‌లాండ్, కంబోడియా మధ్య చారిత్రక శాంతి ఒప్పందంపై సంతకాలను పర్యవేక్షించనున్నారు. "ఈ శాంతి చర్చల సానుకూల ఫలితాలను అధ్యక్షుడు ట్రంప్ చూడాలని ఆసక్తిగా ఉన్నారు" అని మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం తెలిపారు. అనంతరం జపాన్‌లో పర్యటించి, ఆ దేశ తొలి మహిళా ప్రధానిగా ఇటీవల నియమితులైన సనాయ్ తకైచీతో సమావేశమవుతారు. దక్షిణ కొరియాలో ట్రంప్ పర్యటన మరింత కీలకం కానుంది. అక్కడి అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో భేటీ అవ్వడంతో పాటు, వ్యాపారవేత్తలతోనూ సమావేశమవుతారు. మరోవైపు ట్రంప్ పర్యటనకు కొద్ది రోజుల ముందే ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడం ఉద్రిక్తతలను పెంచింది. దీంతో సైనిక రహిత జోన్ (డీఎంజెడ్)లో పర్యటనలను దక్షిణ కొరియా నిలిపివేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో మరోసారి సమావేశమయ్యే అవకాశాలున్నాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై వైట్ హౌస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# సీఎం అభ్యర్థి తేజస్వీ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమరంలో విపక్ష మహాగఠ్‌బంధన్ (మహాకూటమి) తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించింది. ఊహాగానాలకు తెరదించుతూ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి గా రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) యువనేత తేజస్వీ యాదవ్ పేరును కూటమి పక్షాలు ఏకగ్రీవంగా ఖరారు చేశాయి. తమ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ(వీఐపీ) అధినేత ముఖేష్ సహానీ పేరును ప్రకటించాయి. సీఎం, డిప్యూటీ సీఎం అభ్యర్థుల ఎంపికపై కొన్నిరోజుపాటు జరిగిన చర్చోపచర్చలు ఎట్టకేలకు ముగిశాయి. కూటమి నేతలు గురువారం పట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిహార్‌లో మార్పు కోసం ఏడు పార్టీల మహాగఠ్‌బంధన్ ఐక్యంగా పోరాడుతుందని స్పష్టం చేశారు. కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా యువనేత తేజస్వీ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ చెప్పారు. ఆయన నవ యువకుడు అని, ఏది చెబితే అది చేస్తారని, ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటారని వెల్లడించారు. కూటమిలో కీలక నేత ముఖేష్ సహానీ పేరు ప్రతిష్టలను దృష్టిలో పెట్టకొని ఆయనను డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

# అతిథుల కోలాహలం మధ్య హన్సిక- హారిక బర్త్డే వేడుకలు

### హన్సిక - హారిక కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గొల్లూరి శివానంద్ సాగర్




కర్మన్ ఘాట్ వార్త మిర్రర్ ప్రతినిధి : కర్మన్ ఘాట్ నిర్మలా నగర్ కాలనీలో హన్సిక- హారిక బర్త్డే వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న (ఎస్ ఎన్ ఎస్ ) గొల్లూరి శివానంద్ సాగర్ హాజరై, హారిక- హన్సిక బర్త్డే సందర్భంగా కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ హన్సిక- హారిక ఉన్నత చదువులు చదువుతూ, ఇంటికి వచ్చిన బంధుమిత్రుల తో స్నేహ పూర్వకంగా ఉంటూ, హారిక- హన్సిక ప్రవర్తన, నడవడిక, సమాజం పట్ల బాధ్యత, తల్లిదండ్రుల పట్ల గౌరవం తోటి విద్యార్థుల పట్ల స్నేహం, సహాయ సహకారాలు వంటి గుణాలను పెంపొందించుకున్నారని తెలిపారు, వారి జన్మదిన వేడుకలను నిర్వహించడం గర్వంగా ఉందని తెలిపారు. గొల్లూరి



శివానంద సాగర్ తల్లిదండ్రులు కల్లెట్ల నర్సింగ్ సాగర్, రేణుక మాట్లాడుతూ నా పిల్లలు కవలలు అయినా హారిక- హన్సిక చదువుల్లో ముందంజలో ఉంటారని, ఉన్నత విద్యను అభ్యసించడానికి మా ఛాయా శక్తుల కృషి చేస్తామని తెలిపారు. వారి అభిరుచికి తగట్టు వారి డ్రెస్సులు, ఏదైనా వారికి మేము అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు,ఈ కార్యక్రమంలో కల్లెట్ల వారి బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు

# లక్ష కోట్ల పెట్టుబడులు.. 5 లక్షల మందికి ఉపాధి

చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో గడిచిన రెండేళ్లలో తెలంగాణ సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళికలు, అవకాశాలు, పెట్టు బడులకు ఉన్న అనుకూల తలను మంత్రి వివరించారు.

**అత్యుత్తమ లైఫ్‌సైన్సెస్ క్లస్టర్లలో హైదరాబాద్**

'ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ సీబీఆర్ఈ రూపొందించిన 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ 2025'లో ప్రపంచంలోని అత్యుత్తమ లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో హైదరాబాద్‌కు చోటు దక్కి ంది. బోస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, కేంబ్రిడ్జ్, బీజింగ్, టోక్యో సరసన హైదరాబాద్ నిలిచింది. లైఫ్ సైన్సెస్ ఆఫీస్ లీజింగ్ 2022లో 0.6 మిలియన్ చదరపు అడుగులు కాగా, 2024 నాటికి నాలుగు రెట్లు పెరిగి 2.4 మిలియన్ చదరపు అడుగు లకు చేరింది. లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ, యంగ్ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్, ఇతర అంతర్జాతీయ దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో భవిష్యత్ బయో %-%డిజిటల్ యుగానికి కావాల్సిన అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసు కుంది. ఆస్ బయోటెక్ ఇంటర్నేషనల్ సద స్సు 'విక్టోరియా తెల ంగాణ ఇన్నోవేషన్ కారిడార్'కు నాంది పలకాలి'అని శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో హైదరా బాద్‌లో జరిగే బయో ఏషియా సదస్సు కు హాజరు కావాలని దిగ్గజ లైఫ్ సైన్సెస్ పరిశ్రమలను మంత్రి ఆహ్వానించారు. సదస్సులో విక్టోరియా మంత్రులు రోస్ స్పెన్స్, డానీ పియ ర్సన్, ఆస్ బయోటెక్ చైర్మన్ డాక్టర్ జేమ్స్ క్యాంప్‌బెల్, తెల ంగాణ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.

# నేడు బిహార్‌కు మోదీ, అమిత్‌షా

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ, హెూం మంత్రి అమిత్ షా బిహార్ లో పర్యటించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రక టించిన తర్వాత తొలిసారి మోదీ బిహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. అమిత్ షాకు ఇది రెండో పర్యటన. ఎన్డీయే తరఫున శుక్రవారం ఈ ఇద్దరు నేతలు మొత్తం నాలుగు బహిరంగ సభల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. భారత రత్న, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ సొంత జిల్లా సమస్తిపూర్ నుంచి ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారు. అక్కడ నిర్వహించనున్న భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం.. బెగుసరాయ్‌లో మరో బహిరంగ సభలో పాల్గొంటారు. హెూం మంత్రి అమిత్ షా సివాన్, బక్సర్‌ల్లో జరిగే బహిరంగ సభల్లో పాల్గొంటారు. ఈ నెల 30వ తేదీన కూడా ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ముజఫర్‌పూర్, ఛప్రాలలో బహిరంగ సభల్లో పాల్గొంటారు. ఇద్దరు కీలక నేతలు ఎన్నికల ప్రచారం నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ నేతలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. మరోవైపు పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రధాని, కేంద్ర హెూంమంత్రి ఎన్నికల ప్రచారంతో రాష్ట్రంలో రాజకీయ వేడి మరింత పెరుగుతుందని, ఎన్డీయే ప్రచారానికి మరింత ఊతం ఇస్తాయని ఆ వర్గాలు చెబుతున్నాయి.

**28న మహాగఠ్‌బంధన్ మేనిఫెస్టో విడుదల**

బిహార్ ఎన్నికల కోసం మహాగఠ్‌బంధన్ మేనిఫెస్టోను ఈ నెల 28న పట్నాలో విడుదల చేసే అవకాశం ఉంది. మొదటి దశ పోలింగ్‌కు ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఆ తర్వాత రెండో దశ ఎన్నికల కోసం కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఛత్ పూజ తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంకా గాంధీ కూడా ప్రచారంలో పాల్గొంటారని మహా కూటమి వర్గాలంటున్నాయి.




# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచి, స్థానిక ఎన్నికలకు వెళ్దాం

(మొదటి పేజీ తరువాయి)

విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై నవంబర్ 3న హైకోర్టులో జరగనున్న విచారణలో వెలువడే ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. నవంబర్ 7న మళ్లీ మంత్రివర్గ సమావేశం నిర్వహించి రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ తీర్మానించినట్లు వివరించారు. శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టు సొరంగం తవ్వకాల కోసం ఇప్పటి వరకు అనుసరించిన టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) విధానాన్ని పక్కనబెట్టి, అత్యాధునిక డ్రిల్లింగ్ పరిజ్ఞానంతో మిగతా పనులు పూర్తిచేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. దివాళా పరిష్కార ప్రక్రియను ఎదుర్కొంటున్న నిర్మాణ సంస్థ జయప్రకాశ్ అసోసియేట్స్‌తో గతంలో చేసుకున్న ఒప్పందాన్నే కొనసాగిస్తూ ప్రభుత్వంపై అదనపు భారం పడకుండా 2026 చివరి నాటికి లేదా 2027 ప్రారంభం నాటికి లేదా 2028 జూన్‌లోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. జలయజ్ఞంలో భాగంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా ఫ్లోరైడ్ బాధిత నల్లగొండ జిల్లాకు 30 టీఎంసీల కృష్ణా జలాలను తరలించి 3.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ప్రారంభించిన ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణం ప్రాజెక్టును గత బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం చేసిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. 44 కి.మీ.ల సొరంగం తవ్వాల్సి ఉండగా, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 31%-%32 కి.మీల తవ్వకాలు జరిగాయని, ఆ తర్వాత 10 ఏళ్లలో బీఆర్ఎస్ సర్కారు 2%-%2.5 కి.మీ.ల మేర మాత్రమే తవ్వకాలు జరిపిందని విమర్శించారు. ప్రపంచంలోనే అతి పొడువైన 44 కిలోమీటర్ల సొరంగంలో రెండు వైపుల నుంచి ఇప్పటివరకు 35 కిలో మీటర్ల సొరంగం తవ్వకం పూర్తయింది. మిగిలిన 9 కిలోమీటర్ల సొరంగం తవ్వడానికి అటవీ, పర్యావరణ, వన్య ప్రాణులకు ఇబ్బంది లేకుండా అత్యాధునిక పరిజ్ఞానాన్ని వాడాలని కేబినెట్ తీర్మానించింది. రాష్ట్రంలో 1,500 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలకు రాష్ట్ర కేబినెట్ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఈ యూనిట్లను ఎక్కడ ఏర్పాటుచేయాలనే అంశంపై విద్యుత్ శాఖ తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించింది. రామగుండంలో 52 ఏళ్ల క్రితం నిర్మించిన 62.5 మెగావాట్ల థర్మల్ బీ%-%స్టేషన్‌ను తొలగించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఇప్పుడున్న విద్యుత్తు అవసరాలు, రాబోయే పదేళ్ల విద్యుత్ డిమాండ్ అంచనాలకు అనుగుణంగా భవిష్యత్తు ప్రణాళిక తయారు చేయాలని విద్యుత్ శాఖను కేబినెట్ ఆదేశించింది. సౌర, బ్యాటరీ స్టోరేజీ, రివర్స్ పంపింగ్ ద్వారా అందుకు అవసరమైన విద్యుదుత్పత్తికి వ్యూహాలు సిద్ధం చేయాలని కోరింది.

# ప్రజలు కోరితే కొత్త పార్టీ

### ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన



యాదగిరిగుట్ట: ఒక రాజకీయ పార్టీ పెడితే తన కోసం కాదని..ప్రజలకు మేలు జరగాలని, ప్రజలు కోరుకుంటే తప్పకుండా రాజకీయ పార్టీ పెడతానని ఎంఎల్‌సి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని గురువారం ఆమె దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆమె విలేఖరులతో మాట్లాడారు. ఈనెల 25 నుం చి దాదాపు నాలుగు నెలల పాటు 'జనం బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగాకొత్త రాజకీయ పార్టీపై ప్రజల అభిప్రాయం తె లుకుంటానని అన్నారు. మొన్న తిరుపతి, ఈరోజు యాదగిరిగుట్టకు వచ్చామని, 'జనం బాట'కు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులు కావాలని ప్రత్యేక పూజలు చేశామని తెలిపారు. 'జనం బాట' కార్యక్రమానికి ఎలాంటి అవాంతరాలు రాకుండా చూడాలని స్వామివారిని వేడుకున్నామని తెలిపారు. 'జనం బాట'లో అన్ని వర్గాల ప్రజల సమస్యలు తెలుసుకుంటానని అన్నారు. ఈనెల 25న తమ సొంత ఊరు నిజామాబాద్ నుంచే జనం బా ట కార్యక్రమం ప్రారంభమవుతుందని, 33 జిల్లాల్లో 4 నెలల పాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో రెండు రోజు ల పాటు ఉండి అక్కడి మేధావులు, విద్యావంతు లు, రైతులు, యువత, మహిళలను కలుసుకొని స మస్యలు తెలుసుకుంటామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు, తమిళనాడులో రెండు ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని, ఇక్కడి ప్రజలు కోరుకుంటే త ప్పకుండా పార్టీ పెడతానన్నారు. పార్టీలు ఉండడం కాదని, వాటితో ప్రజలకు మేలు జరగాలని అ న్నారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకునేందుకే 'జనం బాట' కార్యక్రమం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ యాదాద్రిని మహాద్భుతంగా పునర్నిర్మించారని, ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కూడా యాదాద్రి ప్రాశస్త్యాన్ని కాపాడే విధంగా ప్రయ త్నం చేయాలని హితవు పలికారు. యాదగిరిగుట్ట వస్తుంటే దారిపొడవునా విచిత్రమైన హోర్డింగ్‌లు ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించి ఆలయానికి సంబంధించిన హోర్డింగ్‌లు మాత్రమే పెట్టాలని సూచించారు. మళ్లీ యాదగిరిగుట్టను సందర్శిస్తానని, అప్పుడు ఇప్పటి సమస్యలపై వివరంగా మాట్లాడుతానని అన్నారు.



# కొత్త సీజేఐ ఎంపిక ప్రక్రియ షురూ

వెల్లడించాయి. ప్రస్తుత సీజేఐకి 65 ఏళ్లు పూర్తికావడానికి ఒక నెలముందే ఆయనకు తదుపరి సీజేఐ కోసం సిఫార్సు లేఖ పంపడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం సీజేఐ తర్వాత సుప్రీంకోర్టు జడ్జీల్లో అత్యంత సీనియర్ మోస్ట్‌గా జస్టిస్ సూర్యకాంత్ కొనసాగుతున్నారు. తదుపరి సీజేఐ అయ్యే అవకాశాలు ఈయనకే మెండుగా ఉన్నాయి. జస్టిస్ సూర్యకాంత్ హరియాణాలోని హస్సార్ జిల్లాలో ఓ మధ్యతరగతి కుటుంబంలో 1962 ఫిబ్రవరి 10న జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టులో జడ్జిగా పదోన్నతి పొందారు. ఈయన సీజేఐ అయితే దాదాపు 15 నెలలపాటు సేవలందించి 2027 ఫిబ్రవరి 9వ తేదీన రిటైర్ అవుతారు.

# కాంగ్రెస్ హయాంలోనే బస్తీల అభివృద్ధి: కె ఎల్ ఆర్

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ అధిష్ఠానం

## పూర్తి సమయం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఎన్నికకు కేటాయింపు



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 23 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపులో ప్రతీ హస్తం పార్టీ నాయకుల పాత్ర ఉండాలని సికింద్రాబాద్ జిల్లా పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు.మహేశ్వరం నియోజకవర్గంలో వివిధ శుభకార్యాలు, పెళ్లీలకు రాలేకపోతున్నాను మళ్లీ వ్యక్తిగతంగా మీ ఇంటికి వచ్చి కలుస్తాను. ఆహ్వానించిన వారందరికీ ధన్యవాదాలు అని కేఎల్ఆర్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రతిష్టాత్మకంగా కాంగ్రెస్ భావిస్తుందని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న ప్రముఖులు, ఓటర్లు ఎన్నికల్లో పాల్గొని ఓటింగ్ శాతం పెంచాలని కిచ్చెన్న కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.బి ఆర్ ఎస్ హయాంలో బస్తీ ప్రజలను పట్టించుకోలేదన్నారు. బీజేపీ నాయకులకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. నిత్యావసరాలు, పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగి పేదవాడు కొనే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న గులాబోని గూబ గుయ్యుమనేలా ప్రజాతీర్పు ఇవ్వాలని ఓటర్లకు కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు.

# ముగ్గురు పిల్లల నిబంధనలను ఎత్తివేస్తూతీసుకున్న నిర్ణయం సంతోషకరం

## కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మాజీ సెక్రటరీ మహ్మద్ జానీ



సంస్థాన్ నారాయణపూర్ అక్టోబర్ 23( వార్త మిర్రర్):

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు పిల్లల నిబంధనలను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మాజీ సెక్రటరీ మహ్మద్ జానీ హర్షం వ్యక్తం చేశారు.గత 30 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఈ నిబంధనను ఎత్తివేయడానికి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరమని, ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మునుగోడు నియోజ కవర్గం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్న ఎంతోమందికి అవకాశం లభిస్తుందని అన్నారు.ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన సంగతి తెలిసిందే.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా 42% రిజర్వేషన్ బిల్లును ఆమోదించి త్వరగా ఎన్నికలు జరిగే విధంగా సహకరించాలని కోరారు.



# నాంది కమ్యూనిటీ వాటర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉచితంగా సోలార్ స్టడీ లా ప్స్ పంపిణీ

సంస్థాన్ నారాయణపూర్ అక్టోబర్ 23( వార్త మిర్రర్ ):వావిళ్లపల్లి గ్రామంలోని ఉన్నత ప్రాథమిక పాఠశాలలో" నాంది కమ్యూనిటీ వాటర్ సర్వీస్,ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా సోలార్ స్టడీ లాంప్స్ పంపిణి చేయడం జరిగింది.జిల్లా సరిహద్దు గ్రామాల్లో ఒకటి వావిళ్లపల్లి గ్రామం. మౌలిక వసతులకు దూరంగా ఉన్నది.విద్యార్థులు మెరుగైన వసతులు,ప్రోత్సాహన్ని కల్పిస్తే ఉన్నత విద్య చదువే వారి సంఖ్య పెరుగుతుంది అని ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి అన్నారు.సుమారు 10 వేల విలువ గల సోలార్ స్టడీ లాప్స్ విద్యార్థులకు అందించిన ఎన్ సి డబ్ల్యూ ఎస్ సంస్థ వారికి పాఠశాల ఉపాధ్యాయ బృందం ధన్యవాదములు తెలిపారు. ఎన్ సి డబ్ల్యూ ఎస్ అధికారి గిరి బాబు మాట్లాడుతూ ఆరోగ్యావంతమైన మనిషి రోజుకి 3-5 లీటర్లు నీరు త్రాగాలి. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి అంటే నిత్యం తమ చేతులను పరిశుభ్రం గా ఉంచుకోవాలి. స్వచ్ఛమైన త్రాగునీరు,చేతుల పరిశుభ్రత పైన అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం పాఠశాల ఉపాధ్యాయులు,ప్లాంట్ ఆపరేటర్ రాము,గ్రామస్తులు గణేష్,పవన్,సాయి పాల్గొన్నారు.



# గిరిజన ఆశ్రమ పాఠశాల సౌకర్యాల పరిశీలన

**- విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాది**

**- ఆశ్రమ పాఠశాల ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి,కలెక్టర్ సంతోష్ నాయక్**

కల్వకుర్తి అక్టోబర్ 23 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం లోని గిరిజన ఆశ్రమ పాఠశాల ను బుధవారం జిల్లా కలెక్టర్ సంతోష్ తో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆకస్మిత తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా కలిసి వారికి ఎదురవుతున్న సమస్యలు అడిగి తెలుసుకన్నారు. పాఠశాల సౌకర్యాలు,భోజనం వసతి, పాఠశాల భవన స్థితి వంటి అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మార్వో, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు జిల్లెల్ల రాములు, తదితరులు పాల్గొన్నారు

# శేరిలింగంపల్లి యువనేత రవీందర్ యాదవ్ పై వైఎస్ జగన్ ప్రశంసలు

**శేరిలింగంపల్లి నియోజకర్గంలోని సేవా కార్యక్రమాలపై సుధీర్ఘ చర్చ**

**కేసీఆర్, కేటీఆర్ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్న వైస్ జగన్**

**వైఎస్ జగన్ ను కలవడంపై రవీందర్ యాదవ్ హర్షం**

**భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ వెల్లడి**



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శేరిలింగంపల్లి యువ నాయకులు, భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ పై ప్రశంసలు కురిపించారు. రవీందర్ యాదవ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు బాగున్నాయన్నారు. ప్రజల కోసం ఎల్లప్పుడూ అండగా ఉండాలని సూచించారు. ప్రజాక్షేత్రంలో పోరాడాలని, రవీందర్ యాదవ్ కు నేను ఉన్నాను అని భరోసాను కల్పించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ను తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా రవీందర్ యాదవ్ కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలపై సుధీర్ఘంగా చర్చించారు. కేసీఆర్, కేటీఆర్ యోగ, క్షేమాలను అడిగి తెలుసుకున్న వైఎస్ జగన్.. రవీందర్ యాదవ్ యువనేతగా రాణిస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలో పోరాడాలని సూచించారు. ఎలాంటి విషయంలోనైనా తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలవడంపై హర్షం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ దమ్మున్న లీడర్ అని కొనియాడారు. ప్రజల కోసం అను నిత్యం ఆలోచించే, తపించే వ్యక్తి అని కొనియాడారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కేసీఆర్ ను, ఆంధ్రాలో వైఎస్ జగన్ ను ఆపడం ఎవరి తరం కాదన్నారు. కేసీఆర్, వైఎస్ జగన్ అధికారంలోకి వస్తారని రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

# కన్స్ట్రక్షన్స్ వద్ద కరెంటు వైర్ల దొంగల ముఠా అరెస్ట్....

నూతన నిర్మాణా భవనలే టార్గెట్.....



మియాపూర్ వార్త మిర్రర్ : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలను దొంగిలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నూతన నిర్మాణంలో ఉన్న భవనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. నిందితుల వద్ద నుంచి మారుతి స్విఫ్ట్ కారు, బజాజ్ పల్సర్ బైకు నాలుగు లక్షల విలువైన విద్యుత్ వైర్లు 81 బేండల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్ పోలీసులు. అందుకు సంబంధించిన వివరాలను మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బీహార్ కు చెందిన దీలిప్ కుమార్ హఫీజ్ పేటలో ని మార్తాండ నగర్ లో నివాసం ఉంటున్న నిశాల్ కరల్కర్ లు స్నేహితులు.జల్సాలకు, చెడు వ్యసనాలకు అలవాటు ఈజీ మనీ కొరకు నిర్మాణంలో ఉన్న భవనల్లో పగలు రెక్కీ నిర్వహించి రాత్రి పుట కారులో వెళ్లి అక్కడ నిలువ చేసిన విద్యుత్ వైర్లు, గృహపకరణాలకు అవసరమైన సామాగ్రిని ఎత్తుకెళ్ళి స్క్రాప్ దుకాణాలు అమ్ముకుని సొమ్ము చేసుకునే వారన్నారు. నిందితులపై గతంలో ఎనిమిది కేసులు మియాపూర్ లో మూడు కేసులు మొత్తం 11 కేసులు ఉన్నాయని నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించమని పోలీసులు తెలిపారు.ఈ సమావేశంలో మియాపూర్ సిఐ శివప్రసాద్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రమేష్ నాయుడు ఎస్సైలు పోలీస్ సిబ్బంది తదితరులు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రమేష్ నాయుడు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం.

కల్వకుర్తి అక్టోబర్ 23 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి మండలం లోని రఘుపతిపేట గ్రామంలో గ్రామస్తుల సహకారంతో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. నేరాల నియంత్ర లో కెమెరాల పాత్ర కీలకమని వీటి ఏర్పాటుతో నేరాలను అరికట్ట వచ్చని నాగర్ కర్నూల్ ఎస్పీ రఘునాథ్ వైభవ్ గైక్వాడ్ ఆదేశాల మేరకు కల్వకుర్తి డిఎస్పి వెంకటరెడ్డి అన్నారు.ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి, రఘుపతిపేట గ్రామస్తులు హరీష్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాలస్వామి, గ్రామస్తుల తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు సేవ చేయడమే లక్ష్యం

కల్వకుర్తి ఊర్కొండ అక్టోబర్ 23 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఊర్కొండ మండల కేంద్రానికి చెందిన గడ్డం మహేందర్ వారం రోజుల క్రితం గుండె పోటు తో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న జకినాలపల్లి మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి వారి ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపి తక్షణ సహాయం రూ " 5000 రూపాయలు ఊర్కొండ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వంగ సంతోష్ రెడ్డి రూ"5000 రూపాయలు వారి కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంఠం విజయుడు, శివకుమార్, బండారి అశోక్, పోలే ప్రసాద్, పోలే బాలయ్య, పోలే లక్ష్మయ్య, అకుల పర్శ, ప్రసన్న కుమార్, శేఖర్ పోలే, దార రమేష్, నాగయ్య, ఆశీర్వాదం, యాదగిరి గడ్డం, బండి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు .



# న్యాయవాదుల అభ్యున్నతి కోసం కృషి చేస్తా

మిర్యాలగూడ , అక్టోబర్ 23:-( వార్త మిర్రర్) న్యాయవాదుల అభ్యున్నతి కోసం పోరాడ్తానని రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్, బార్ కౌన్సిల్ అభ్యర్థి రాపోలు భాస్కర్ అన్నారు. గురువారంతెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భాస్కర్ తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని ప్రచారానికి మిర్యాలగూడ కోర్టుల సముదాయానికి వచ్చారు. కౌన్సిల్ మెంబర్ గా గెలిపించాలని న్యాయవాదులను కోరారు. కార్యక్రమంలోమిర్యాలగూడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నేతి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సుండి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ అలుగుబెల్లి భూపతి రెడ్డి, సీనియర్, జూనియర్ అడ్వకేట్స్ కొంక వెంకన్న, రఘురామారావు, కల్యాణ్ బాబు, ఎన్. కృష్ణయ్య , గోదాల వెంకట రెడ్డి, ఇస్రం కరుణాకర్, రాయారపు భాస్కర్ నాయుడు, కందిబండ శ్రీనివాస్, జిల్లపల్లి శ్రీనివాస్, ధూపాటి మట్టయ్య, హతిరామ్, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ అడ్వకేట్స్ పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లకు ఆత్మీయ వీడ్కోలు సన్మానం

**తాజ్ పూర్ గ్రామ అభివృద్ధిలో వెంకటేశ్వర్ల కృషి ఎంతో ఉంది ... డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్తున్న సందర్భంగా గ్రామంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ 6 సంవత్సరాలుగా గ్రామ అభివృద్ధిలో తన వంతు బాధ్యతను నిర్వహించి తాజ్ పూర్ గ్రామానికి తాజ్ పూర్జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు సాధించడంలో వెంకటేశ్వర్లు పాత్ర ఉందని అన్నారు. నేడు బదిలీపై వెళుతున్న సందర్భంగా ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మానోత్సవములో పాల్గొని గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ర్యాకల సంతోష ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మరపు సురేష్, మాజీ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గోవిజ్ఞాన పరీక్షల స్టేట్ లెవెల్ కు సెలెక్ట్ అయిన రాయికల్ విద్యార్థులు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 23

వైష్ణవ ఠాకురా ఫౌండేషన్ మరియు గో సేవ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి గోవిజ్ఞాన పరీక్షల నిర్వహణలో భాగంగా ఫస్ట్ లెవెల్ సెకండ్ లెవెల్ ఎగ్జామ్స్ పూర్తి చేసుకొని స్టేట్ లెవెల్ కి జగిత్యాల జిల్లా నుండి 94 మంది సెలెక్ట్ కాగా రాయికల్ లోని రెండు పాఠశాలల



నుండి ముగ్గురు విద్యార్థులు స్టేట్ లెవెల్ కి ఎంపికయ్యారు. స్టేట్ లెవెల్ ఎగ్జామ్ లిఈనెల 26వ తేదీన కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజ్ నారాయణగూడలో జరగనుంది. అని జగిత్యాల జిల్లా గో-సేవ ప్రముఖ్ బీరెల్లి సంతోష్ రాయికల్ ఖండ గో-సేవా ప్రముఖ్ శ్రీగద్దే సుమన్ తెలియజేయడం జరిగింది. ప్రభుత్వ బాలురు పాఠశాల నుండి ఎంపిక్కెన విద్యార్థి పేరు కొత్తపల్లి శ్రీరాం, వివేవర్ధిని పాఠశాల నుండి ఎంపిక్కెన విద్యార్థుల పేర్లు, దొంత శ్రీనిధి, కడకుంట్ల మన్విత్




# అండర్-19 టి -20 టోర్నీకి స్ఫూర్తి డిగ్రీ మహిళ కళాశాల విద్యార్థి ప్రతీక ఎంపిక.

రామంతపూర్ వార్త మిర్రర్ ప్రతినిధి

రామంతపూర్ స్ఫూర్తి మహిళా డిగ్రీ కళాశాల డిగ్రీ విద్యార్థిని ప్రతీక (17) అండర్-19 మహిళ టి -20 క్రికెట్ పోటీలకు ఎంపికయింది, అక్టోబర్ 26 నుంచి వచ్చేనెల 2 వరకు ముంబైలో జరగనున్న బి సి సి ఐ టోర్నమెంట్ లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ( హెచ్ సి ఏ ) తరపున ఆడనుంది, ఈ సందర్భంగా స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, క్రికెట్ కోచ్ మహేష్ ప్రతీక కు అభినందనలు తెలిపారు

## శిల్పారామం లో ప్రారంభమైన గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్ మేళ...




మాదాపూర్ వార్త మిర్రర్ : శిల్పారామం మాదాపూర్ లో గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్ 2025 మేళ ప్రారంభమయింది. ఇండస్ట్రియల్ ఎక్స్టెన్షన్ కాటేజీ , గవర్నమెంట్ అఫ్ గుజరాత్ మేనేజర్ క్లాస్ వన్ శ్రీ ఆర్ ఎస్ షా , మార్కెటింగ్ మేనేజర్ డాక్టర్ స్నేహాల్ మక్వాన మరియు గుజరాత్ నేషనల్ అవార్డీ ఆర్టిసన్స్ అందరు కలిసి గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్ ని ప్రారంభించారు. గుజరాత్ రాష్ట్రం నుండి విచ్చేసిన 80 చేనేత హస్తకళా కళాకారులు తమ ఉత్పత్తులను సందర్శకుల కోసం అందుబాటులో ఉంచారు. ప్రతి ఒకరికి వారు చేసిన హస్తకళా ఉత్పత్తుల గురించి వివరంగా చూపించారు. అద్దాల సంచులు, బట్టలు, చీరలు, కాచ్వర్క్ చేసిన చీరలు, డ్రెస్ మెటీరియల్స్, చెక్క తో తయారు చేసిన గృహాలంకారాలు, మడ్ మిర్రర్ వర్క్, పటోళ్ల చీరలు, తంగలియా చీరలు, చున్నీలు, బ్లాక్ ప్రింటింగ్ మెటీరియల్స్ సందర్శకులకు పది రోజుల పాటు అందుబాటులో ఉంటాయి. కాలావణ్య కుమారి సృజన వలివేటి, కుమారి కీర్తి వలివేటి బృందం భరతనాట్యం ప్రదర్శన ఆద్యంతం అలరించింది. గణేశా స్తుతి, పుష్పాంజలి, అలరిపు, వినాయక కౌతం, శివ తాండవ స్తోత్రం భోశంభో మొదలైన అంశాలను ప్రదర్శించి మెప్పించారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను జరుగుతూ ఉంటాయి...

## పిజిటెట్ లో భాషల సిలబస్ మార్పుకై ముఖ్యమంత్రి కి వినతి...

### ఆర్.యు.పి.పి రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్...



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 23

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న టిజిటెట్ నందు పేపర్ -2 లో తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ, సంస్కృతం, కన్నడ మరాఠీ మొదలగు సబ్జెక్టులకు సంబంధించిన కంటెంట్ సిలబస్ (60 మార్కులు) లో లేకపోవడం వలన భాషోపాధ్యాయులకు అర్హత సాధించడం చాలా కష్టంగా మారిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భాషోపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న టెట్ టెట్ పేపర్-2 లో కంటెంట్ 60 మార్కులతో నిర్వహిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ మాదిరిగా తెలంగాణ లో కూడా భాషోపాధ్యాయుల టెట్ పేపర్ 2 లో సిలబస్ ను సంబంధిత సబ్జెక్టులలో కంటెంట్ 60 మార్కులు ఉండేలాగా మార్పు చేసి న్యాయం చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు సంఘ పక్షాన ముఖ్యమంత్రి గారిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి లను సవినయంగా కోరుతూ రిజిస్టర్ పోస్టు, మేయిల్ ద్వారా వినతిపత్రం సమర్పించినట్లు రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ తెలిపారు.



## ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

### కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ కు వినతి

### సమాచార హక్కు సాధన సమితి జిల్లా కన్వీనర్

కాప్రా, వార్త మిర్రర్, అక్టోబర్ 23 : ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ కు విజ్ఞప్తి చేశారు. తహసిల్దారుగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గగన్ కుమార్ మాట్లాడుతూ కాప్రా మండల పరిధిలోని ప్రభుత్వ భూముల రక్షణ కోసం చొరవ చూపాలని కోరారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు తహసిల్దార్ పనిచేసిన సుచరిత పరిరక్షించిన భూములను కాపాడాలని కోరారు. వివిధ సర్వే నంబర్లలో ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి కంచె వేసినా భూములన్నిటిని కూడా యధావిధిగా రక్షించాలని ఆయన కోరారు. ఇందుకు బైరెడ్డి రాజేష్ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ భూములు కాపాడే విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని హామీ ఇచ్చినట్టు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఖచ్చితంగా స్పందిస్తామని, భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా చారీ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఏరియా ఆసుపత్రి కార్మిక టెండర్లు సత్వరమే

### చేపట్టాలి ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు సయీద్

మిర్యాలగూడ ,అక్టోబర్ 23:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఏరియా ఆసుపత్రి కార్మిక టెండర్లను సత్వరమే చేపట్టాలని, కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని ఏరియా ఆసుపత్రి కార్మికుల యూనియన్ గౌరవ అధ్యక్షులు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం టెండర్లు. వేతన పెంపుకు చర్యలు చేపట్టాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల గుత్తేదారు కాలపరిమితి ముగిసినందున వెంటనే కొత్త టెండర్లు పిలవాలన్నారు. వేతనం రూ.26,000ల ఇప్పించాలన్నారు. కాంట్రాక్టర్ కాలపరిమితి ముగిసినందున వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతుందని తక్షణమే టెండర్లు పిలవాలన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జానిమీయా, పద్మ, శ్రీనయ్య, వెంకటమ్మ, నాగమణి, మహేష్, అంజయ్య, స్వప్న ఉన్నారు

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి





మిర్యాలగూడ అక్టోబర్ 23:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి గుర్తించిన స్థలంలో సరిహద్దులు నిర్ధారించి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మిర్యాలగూడ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 214 లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ భూమిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి ప్రతిపాదించగా, మొత్తం 25 ఎకరాల స్థలంలో పాఠశాల భవనాల నిర్మాణం చేపట్టేందుకు గాను సరిహద్దులను నిర్ధారించి మ్యాప్ తో సహా పంపించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంలో భాగంగా తరగతి గదులు, హాస్టల్, డార్మెటరీ, లైబ్రరీ, ల్యాబ్ లు, ఆటస్థలం, ఆడిటోరియం, అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ఎం. నారాయణ్ అమిత్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పవన్, మిర్యాలగూడ తహసిల్దార్ ఎస్.సురేష్ కుమార్ ఉన్నారు.

## ఎర్రగడ్డలో జూబ్లీహిల్స్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ప్రచారం లో మియాపూర్ టీమ్ సభ్యులు



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఎర్రగడ్డ డివిజన్లో బీజేపీ మియాపూర్ టీమ్ సభ్యులు డోర్ టు డోర్ ప్రచారం ఘనవంతంగా జరిగింది. ప్రజలతో ప్రత్యక్షంగా సమావేశమై, వారి సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుని, బిజెపి పార్టీ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి దీపక్ రెడ్డి కి మద్దతుగా ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే అవకాశాన్ని మాకు లభించింది అని ప్రచారం ద్వారా ప్రజలలో బీజేపీ వైపు ఉత్సాహం, కృషి మరియు అభివృద్ధి కోసం ఆకాంక్షను స్పష్టంగా గుర్తించి ఆ దిశగా అంకిత భావం తో పని చేస్తున్నాము అని తెలిపారు. ప్రచారంలో ముఖ్యంగా నల్లూరి పట్టాభిరామ్ మియాపూర్ బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కన్నికంటి ప్రభాకర్ పొలిటికల్ అనలిస్ట్ ఎర్రగడ్డ డివిజన్ నాయకులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా రాజు (బూత్ 85, 86, 87, 88, 89, 90) , రాజు వారి టీం జ్యోతి, అంజలి, దివ్య, రినా కృషితో ప్రజలకు పార్టీ అభ్యర్థి విజయం సాధించే దిశగా అవగాహన కలిగించబడింది. వారి కృషి కిప్రత్యేక ధన్యవాదాలు రాజు గారి టీమ్ కి, వారి సహకారం , కృషి వల్ల ప్రచారం మరింత విజయవంతంగా సాగింది అని ఖచ్చితంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విజయం ఖాయమని ఈ సందర్భంగా వారు తెలిపారు. ప్రచారం విజయవంతం కావడంలో టీమ్ పట్టాభి సభ్యులు నరేష్, మాధవి రాణి, ప్రసాద్, స్వరూప్, బాబా, సఫారీ, బాబాయ్ ముఖ్యంగా కృషి చేశారు. ప్రజల దగ్గరికి చేరి వారి సమస్యలను వినడం, పార్టీ విధానాలను వివరించడం ద్వారా ఈ ప్రచారం మరింత ప్రభావవంతంగా నిలిచింది.ఈ కార్యక్రమం నల్లూరి పట్టాభిరామ్ బిజెపి సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. వారి నాయకత్వం, అనుభవం, సమన్వయం వల్ల మేము ప్రజలతో మరింత దగ్గరగా చేరగలిగాము.ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా ప్రజలు, నాయకులు, టీమ్ సభ్యులు , సామాజిక ప్రతినిధులు మన బీజేపీ జెండా ఎగురుతుందని, ప్రజల సంకల్పం దృఢంగా ఉందని ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా ఎర్రగడ్డ డివిజన్ ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి కి భారీ మద్దతు ఏర్పడినట్టు స్పష్టమైందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# వెజిటేబుల్ మార్కెట్ అభివృద్దే లక్ష్యం..



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి డివిజన్ లోగల నల్లగండ్ల వెజిటేబుల్ మార్కెట్ లో నూతనంగా చేపడుతున్న పునర్నిర్మాణ పనులను శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి ఎ సి చైర్మన్ అరికెపూడి గాంధీతో కలిసి పర్యవేక్షించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుందరీకరణతో మార్కెట్ ను ఆదర్శంగా తీర్చితిద్దుతామని వారు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన అత్యవసర పనులను గుర్తించి పనులు చేపడుతున్నట్లు అన్నారు. మార్కెట్ అభివృద్ధితో పాటు చిరు వ్యాపారులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ వీరేశంగౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు జనార్ధన్ రెడ్డి, కే రాంచందర్, విష్ణువర్ధన్ రెడ్డి, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ ఖాజా పాషా, రషీద్, అజీమ్, అస్లాం, శ్రీనివాస్, శంకర్, ఆంజనేయులు, అజామ్, సాయి, మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ నియోజకవర్గ అభివృద్దే ప్రధాన లక్ష్యం

### నియోజక వర్గంలో రోడ్లకు 470 కోట్లు మంజూరు

### ముఖ్యమంత్రి,మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ అక్టోబర్ 23 వార్త మిర్రర్::దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధి ప్రధాన లక్ష్యం అని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. దేవరకొండలో గురువారం నాడు ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గం పరిధిలో రోడ్ల నిర్మాణానికి 470 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. పంచాయతీల శాఖ, ఆర్ అండ్ బి, గిరిజన శాఖ, హామ్ నిధుల నుండి నియోజకవర్గ పరిధిలో బీటీ రోడ్లు, కాజ్ వేల నిర్మాణానికి గాను 470 కోట్ల నిధులు మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జిల్లా మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని కొండమల్లేపల్లిలో ఆర్టీవో కార్యాలయం మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ వ్యక్తిగత విమర్శలకు రాజకీయ సవాల్ విసిరిన ఎమ్మెల్యే బాలు నాయక్. తనపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన రాజకీయ ప్రత్యర్థి మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ... వ్యక్తిగత ఆరోపణలు పునరావృతం అయితే మీ చిట్టా విప్పుతానని హెచ్చరించారు. రాబోయే స్థానిక ఎన్నికలలో రవీంద్ర కుమార్ స్వగ్రామం రత్య తండా తో పాటు ఇటీవల కొంతమందిని కాంగ్రెస్ కార్యకర్తలను బిఆర్ఎస్ లో చేర్చుకున్న పెద్ద ఆడిచర్లపల్లి మండలం ధర్మరేఖ్యతండాలలో నువ్వు గాని, నీ మనుషులను గాని నిలబెట్టి గెలవాలని, మీరు గెలిస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తానని, రాబోయే ఎన్నికలలో మా సత్తా ఏంటో చూపిస్తామని రవీంద్ర కుమార్ కు ఎమ్మెల్యే బాలునాయక్ రాజకీయ సవాల్ విసిరారు. ఈ సమావేశంలో వారితో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

## బీసీ ఐక్యవేదిక తెలంగాణ అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్..



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : తెలంగాణ రాష్ట్రంలో బీసీల హక్కు అయినా రిజర్వేషన్ల సాధన పై చేస్తున్న ఉద్యమాన్ని అక్రమ అరెస్టులతో ఆపలేరని ఎంతటి వరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉంటామని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాజ్ భవన్ ముట్టడికి వెళ్తున్న బీసీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి చందానగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమ అరెస్టులపై బేరి రామచందర్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బిసి లకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చట్టం చేస్తే గవర్నర్ రాష్ట్రపతికి పంపకుండా అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వాలు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. రాజ్ భవన్ ముట్టడికి వెళ్తున్న బీసీ నాయకులను కేంద్రంలోని అధికార బిజెపి ప్రభుత్వం అడ్డుకునే కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ సాధించేవరకు పోరాటాలు కొనసాగిస్తామని ఎవరైనా అడ్డుపడాలని చూస్తే బీసీల ఓట్లతో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. బీసీల రిజర్వేషన్లపై ప్రధాని మోదీ స్పందించాలని, తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ చట్టం అమలయ్యేలా చూడాలన్నారు. అనంతరం బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలు పై రాజభవన్ ముట్టడినీ పోలీసులు అడ్డుకొనీ చందానగర్ పోలీస్ స్టేషన్ కు అక్రమంగా తరలించిన బీసీ ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామ్ చందర్ యాదవ్, సిపిఎం పార్టీ శేర్లింగంపల్లి సభ్యులు కొంగరి కృష్ణ ముదిరాజ్ అరెస్టును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు.



# వందరోజుల్లో షూటింగ్ పూర్తి చేస్తారట?

'ది రాజాసాబ్' దాదాపు పూర్తికావచ్చింది. 'ఫౌజీ'ని కూడా ఫినిష్ చేసే పనిలో బిజీగా ఉన్నారు ప్రభాస్. దీని తర్వాత 'స్పిరిట్' సెట్‌లోకి ఎంటరవుతారాయన. ఇందులో పవర్‌ఫుల్ కాప్‌గా ప్రభాస్ నటించబోతున్నారు. నిజానికి 'స్పిరిట్' వర్క్ ఎప్పుడో మొదలైంది. ప్రీప్రొడక్షన్ వర్క్‌కు ఎక్కువ సమయం తీసుకోవడం దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ట్కస్టైల్. బౌండ్ స్క్రిప్ట్‌ని చేత పట్టుకొని పక్కా ప్లానింగ్‌తో ముందుకెళ్తారాయన. ఈ సినిమాకు సంబంధించిన సెట్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ నేతృత్వంలో మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా పూర్తి చేశారు. ఒక్కసారి షూటింగ్ మొదలుపెడితే, సరిగ్గా వందరోజుల్లో చిత్రీకరణ మొత్తం కంప్లీట్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు సందీప్‌రెడ్డి వంగా, 'యానిమల్' సినిమా షూటింగ్‌ని కూడా ఆయన కేవలం వందరోజుల్లోనే ముగించారట. అదే



విధానాన్ని 'స్పిరిట్' విషయంలోనూ అవలంబిస్తున్నారాయన. త్వరలోనే సినిమా షూటింగ్ మొదలుకానున్నది. ఇదిలావుంటే.. ఇందులోని యాక్షన్ సన్నివేశాల కోసం ప్రభాస్ కొత్త గెటప్‌ని ట్రై చేస్తున్నారట. ఈ సీక్వెన్స్‌లో ప్రభాస్ గెటప్ అండ్ సెటప్ చాలా థ్రిల్లింగ్‌గా ఉండేలా సందీప్ ప్లాన్ చేశారని వినికిడి. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటించనున్న ఈ చిత్రంలో దక్షిణాదికి చెందిన కొందరు అగ్ర నటులు భాగం కానున్నారని తెలిసింది. టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంయుక్త నిర్మాణంలో ఈ సినిమా రూపొందుతున్నది.


## ఉత్కంఠకు గురిచేసే నల్లబంగారం

నటి సంయుక్త మీనన్ నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామాకు 'ది బ్లాక్ గోల్డ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. యోగేష్ కె.ఎం.సి దర్శకుడు. రాజేశ్ దండా నిర్మాత. సంయుక్త మీనన్ స్వయంగా ఈ సినిమాను సమర్పిస్తున్నారు. ఇది కొత్త కాన్సెప్ట్‌తో కూడుకున్న థ్రిల్లర్ అనీ, సంయుక్త డైనమిక్ పాత్రలో కనిపిస్తుందని, ఇందులో ఆమె యాక్షన్ సీన్స్‌లో కూడా నటించిందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రానికి కెమెరా: ఎ.వసంత్, సంగీతం: సామ్.సిఎస్, సహ నిర్మాత: సింధు మాగంటి.

## యూత్‌ఫుల్ యుఫోరియా



నూతన నటీనటులతో అగ్ర దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'యుఫోరియా'. భూమిక చావ్లా, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచిలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్పలత, సాయిశ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాశ్, నవీనారెడ్డి, లికిత్ నాయుడు ముఖ్య పాత్రధారులు. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించిందని మేకర్స్ చెబుతున్నారు. డిసెంబర్ 25న సినిమా విడుదల కానున్నదని తెలియజేస్తూ రిలీజ్ డేట్ పోస్టర్‌ని దీపావళి పండుగ సందర్భంగా మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఓవైపు భూమిక నవ్వుతూ కనిపిస్తున్నది. మరోవైపు పిల్లాడితో ఆడుతూ కనిపిస్తున్నది. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చే సినిమా అని, ఇందులో వినోదంతోపాటు చక్కని సందేశం కూడా ఉంటుందని గుణశేఖర్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: నాగేంద్ర కాశి, కృష్ణహరి, కెమెరా: ప్రవీణ్ కె.పోతన్, సంగీతం: కాలభైరవ, సమర్పణ రాగిణి గుణ, నిర్మాతలు: నీలమ గుణ, యుక్తా గుణ.




## గెట్ రెడీ.. ధ్రువ్ విక్రమ్ బైసన్ నయా పోస్టర్ వైరల్

కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ విక్రమ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం బైసన్ . స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు మారి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ అక్టోబర్ 24న గ్రాండ్‌గా విడుదల కానున్న విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఏదో ఒక అప్‌డేట్ అందిస్తూ మూవీ లవర్స్‌లో ఎక్సయిట్‌మెంట్‌ను పెంచేస్తున్నారు మేకర్స్. రిలీజ్‌కు ఇంకా ఐదు రోజులే ఉన్ననేపథ్యంలో కొత్త పోస్టర్ షేర్ చేశారు. ఆ మృగం మేల్కొనడానికి ఇంకా 5 రోజులు మాత్రమే ఉంది.. అంటూ రిలీజ్ చేసిన నయా పోస్టర్‌లో సినిమాలోని పాత్రలు ఎలా ఉండబోతున్నాయో మరోసారి హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. షార్ట్ హెయిర్‌లో ధ్రువ్ విక్రమ్, పల్లెటూరి అమ్మాయిగా అనుపమ పరమేశ్వరన్ కనిపిస్తుండగా.. మిగిలిన పాత్రలు, యాక్టర్లకు సంబంధించిన లుక్స్ క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ధ్రువ్ విక్రమ్ టీం ఈ సారి గట్టిగానే బాక్సాఫీస్‌ను షేక్ చేసేందుకు రెడీ అవుతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే షేర్ చేసిన బైసన్ లుక్‌లో బ్యాక్ డ్రాప్‌లో అడవిదున్న కనిపిస్తుండగా.. దాని ముందు కండలు తిరిగిన దేహంతో రన్నింగ్‌కు రెడీ అన్నట్టుగా ఉన్న ధ్రువ్ విక్రమ్ స్టిల్ హైప్ క్రియేట్ చేస్తోంది.